

లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

వివేకానందనగర్‌కాలనీ, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): కూకట్‌పల్లి డివిజన్ పరిధిలోని ఆస్‌బెస్టాస్‌కాలనీకి చెందిన మాన్విత, సుబ్రహ్మణ్యేశ్వరరావులకు అత్యవసర వైద్య చికిత్స కోసం ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) ద్వారా చెరో లక్ష రూపాయల చెక్కులను ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ సప్తగిరికాలనీలోని క్యాంపు కార్యాలయంలో మంగళవారం అందజేశారు. పేదలకు మెరుగైన వైద్యం పొందేందుకు సీఎంఆర్ఎఫ్ ద్వారా లబ్ధి పొందాలని ఎమ్మెల్యే కోరారు. కార్యక్రమంలో నాయకులు సాంబశివరావు, బ్రిక్ శ్రీనివాస్, రవిశంకర్, శ్రీజ్యోతి పాల్గొన్నారు.

● సాయిబాబా ఆలయ వార్షికోత్సవం

గచ్చిబౌలి: గచ్చిబౌలి డివిజన్ పరిధిలోని నేతాజీనగర్‌కాలనీలో సాయిబాబా దేవాలయ వార్షిక వేడుకల్లో కార్పొరేటర్ రాగం నాగేందర్‌యాదవ్‌తో కలిసి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా మాధవనంద సరస్వతి స్వామి ఆశీస్సులతో చండీయాగం నిర్వహించారు. తేజస్విశర్మ, సిద్ధయోగి, రవీందర్‌రావు, రాగం అనిరుద్‌యాదవ్, రాగం అభిషేక్‌యాదవ్, తిరుమలేష్, గోపాల్‌యాదవ్, రాజు, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

బ్రేక్ ఫెయిల్ అయి రోడ్డుపై ఆగిన లారీ

● భారీగా స్తంభించిన ట్రాఫిక్

హైదర్‌నగర్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): కూకట్‌పల్లి ఉషాముళ్లపూడి రోడ్‌లో ఎల్లమ్మబండ వద్ద బండరాళ్లతో వెళ్తున్న భారీ లారీ మూలమలుపు వద్ద బ్రేక్‌డౌన్ అయింది. దీంతో ఎక్కడికక్కడ వాహనాలు నిలిచిపోయి భారీ ట్రాఫిక్ జాం అయింది. గంటల తరబడి వాహనాలు నిలిచిపోయినా ట్రాఫిక్ పోలీసులు పట్టించుకోకపోవడంతో వాహనదారులు ఆగ్రహం వ్యక్తం చేశారు.



రోడ్డుపై ఆగిన లారీ



మల్లికార్జున్‌ను సన్మానిస్తున్న పద్మశాలీల సంఘం సభ్యులు

పద్మబ్రాహ్మణ ప్రధాన కార్యదర్శిగా మల్లికార్జున్

పేట్‌బషీరాబాద్, జూన్ 11(ఆంధ్రజ్యోతి): గ్రేటర్ హైదరాబాద్ పద్మశాలి, పద్మబ్రాహ్మణ ప్రధాన కార్యదర్శిగా జి.మల్లికార్జున్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పద్మశాలి సంఘం సభ్యులు ఆయనను శాలువాతో రంగారెడ్డినగర్ డివిజన్‌లో మంగళవారం సన్మానించారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుతి, కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పద్మశాలి సంఘం అధ్యక్షులు ఎ.శంకరయ్య నారా వెంకటేశం, అశోక్, యాదగిరి, శ్రీనివాస్, శేఖర్, దామోదర్ తదితరులు పాల్గొన్నారు.



కార్పొరేటర్‌తో మాట్లాడుతున్న జెడ్‌సీ స్నేహశబరీష్

గచ్చిబౌలి డివిజన్‌లో జోనల్ కమిషనర్ పర్యటన

రాయదుర్గం, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): గచ్చిబౌలి డివిజన్‌లో చేపట్టాల్సిన అభివృద్ధి పనుల కోసం శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ స్నేహ షబరీష్ కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డితో కలిసి మంగళవారం పలు ప్రాంతాల్లో పర్యటించారు. గోపన్‌పల్లితండా, గోపన్‌పల్లి, రాజీవ్‌నగర్‌లో పర్యటించారు. బస్తీల్లో చేపట్టాల్సిన సీసీ రోడ్లు, డ్రైనేజీలైన్లు వాటర్‌పైప్‌లైన్ల ఏర్పాటుకు కావాల్సిన ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో హెచ్‌ఎండబ్ల్యూఎస్ డీజీఎం శరత్‌కుమార్, ఈఈ శ్రీనివాస్, డీఈ విశాలక్ష్మి, టౌన్‌ప్లానింగ్ అధికారులు రవీందర్ రావు, రమేష్, హెచ్‌ఎండబ్ల్యూఎస్ మేనేజర్ అభిషేక్‌రెడ్డి, ఏఎంహెచ్ నగేష్‌నాయక్, రంగారెడ్డి జిల్లా గిరిజన మోర్చా అధ్యక్షుడు హనుమంతునాయక్, నాయకులు రాజు, రమేష్, నర్సింగ్‌నాయక్ పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అధికారులతో సమీక్షా సమావేశం

దుండిగల్, జూన్ 11(ఆంధ్రజ్యోతి): వర్షాకాలం మొదలైన నేపథ్యంలో తీసుకోవలసిన జాగ్రత్తలపై దుండిగల్ మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ సత్యనారాయణ ఆధ్వర్యంలో వివిధ శాఖల అధికారులతో సమీక్షా సమావేశం మంగళవారం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు వర్షాకాలంలో వరదలు, పారిశుద్ధ్య నిర్వహణ, సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు, అత్యవసర యంత్రాంగం సిద్ధంగా ఉంటుందని కమిషనర్ తెలిపారు. సమావేశంలో ఇంజనీరింగ్ ఏఈ ప్రవీణ్‌కుమార్, మేనేజర్ నర్సింహులు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ అంజయ్య, వార్డు ఆఫీసర్లు, శానిటరీ జవాన్లు పాల్గొన్నారు. దుండిగల్ మున్సిపల్ కంట్రోల్ రూమ్ నెంబరు 95427 15277కు సమాచారం ఇవ్వాలని కమిషనర్ కోరారు.



మేయర్ గద్వాల్ విజయలక్ష్మికి వినతిపత్రం ఇస్తున్న కార్పొరేటర్ వెంకటేష్‌గౌడ్

అభివృద్ధి పనులు చేయాలని మేయర్‌కు వినతి

హైదర్‌నగర్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): ఆల్విన్‌కాలనీ డివిజన్‌లోని వాంబేకాలనీలో చెత్తకుప్పలు తొలగించి అభివృద్ధి పనులు చేయాలని డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ మంగళవారం జీహెచ్‌ఎంసీ మేయర్ గద్వాల్ విజయలక్ష్మిని కలిసి వినతిపత్రం అందజేశారు. దీనికి మేయర్ సానుకూలంగా స్పందించినట్లు కార్పొరేటర్ తెలిపారు.

● ఆల్విన్‌కాలనీ డివిజన్ తులసీనగర్‌లో చేపడుతున్న సీసీరోడ్డు పనులను కార్పొరేటర్ వెంకటేష్‌గౌడ్ పరిశీలించారు. కార్యక్రమంలో స్థానికులు శివరాజ్‌గౌడ్, వెంకట్‌నాయక్, సన్యాసిరావు, సంతోష్ బిరాదర్, శ్రీనివాస్‌గౌడ్, జైపాల్, శివ, బసవరెడ్డి, సుందరం, వేణు, రమేష్, శోభారాణి, నాగలక్ష్మి, జీహెచ్‌ఎంసీ ఏఈ శ్రావణి, వాటర్‌వర్క్స్ మేనేజర్ రూప్సీ తదితరులు పాల్గొన్నారు.

స్థలం కోసం ఇరువర్గాల మధ్య ఘర్షణ

● కేసులు నమోదు

గాజులరామారం , జూన్ 11(ఆంధ్రజ్యోతి): స్థలం విషయంలో ఇరువర్గాలు దాడులు చేసుకున్నారు. ఈ సంఘటన సూరారం పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం సూరారం తెలుగుతల్లి కాలనీలోని అంబేద్కర్ వీధిలో 60 గజాల ప్రభుత్వ స్థలంలో ఒక వర్గం బేసిమెంట్ నిర్మించుకుంది. అయితే ఆ స్థలం తమదేనని నిర్మాణం చేపట్టిన మరో వర్గం వారు అడగడంతో వారి మధ్య మాటామాటా పెరిగి ఘర్షణకు దారి తీసింది. ఈ సంఘటనను చూసిన స్థానికులు డయల్ 100కు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని ఘర్షణకు దిగిన వారందరినీ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. స్టేషన్‌కు తీసుకొచ్చిన వారిలో వావిలాల శైలజ, ధర్మి, యమున, అక్షిత, సంధ్యారాణి, చక్రి, భువనగిరి, అఖిల, అర్జున్‌గౌడ్, అపర్ణ, అంజలిలపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

మ్యాన్‌హోళ్లు తెరిస్తే క్రిమినల్ కేసులు

నిబంధనలు ఉల్లంఘిస్తే వాటర్‌బోర్డు కఠిన చర్యలు

హైదరాబాద్ సిటీ, జూన్11 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ హైదరాబాద్‌లో ఎక్కడైనా మ్యాన్‌హోళ్ల మూతలు తెరిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని వాటర్ బోర్డు హెచ్చరించింది. నిబంధనలు ఉల్లంఘించి ఎవ్వరైనా మ్యాన్‌హోళ్ల మూతలను తెరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సూచించింది. వర్షాకాలం నేపథ్యంలో.. ఎలాంటి ప్రమాదాలూ జరగకుండా ఉండేందుకు ఈ సూచనలు చేశారు. వాటర్‌బోర్డు యాక్ట్ -198 9సెక్షన్74 ప్రకారం ఎవరైనా పౌరులు, అనధికార వ్యక్తులు అధికారుల అనుమతి లేకుండా మ్యాన్‌హోళ్లపై ఉన్న మూత తెరచినా, తొలగించినా నేరం. దీన్ని అతిక్రమించి, ఇలాంటి చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటారు. అలాంటి వారిపై క్రిమినల్ కేసు నమోదు చేస్తారు. నిందితులకు జరిమానా విధించడంతోపాటు కొన్నిసార్లు జైలు శిక్ష కూడా వేసే అవకాశముంది. అయితే నగరంలో ఎక్కడైనా మ్యాన్‌హోల్ మూత ధ్వంసమైనా, తెరిచి ఉంచినట్లు గమనిస్తే వెంటనే వాటర్‌బోర్డు కస్టమర్ కేర్ నంబర్ 155313కి ఫోన్‌చేసి సమాచారమివ్వాలని, దగ్గరలోని వాటర్‌బోర్డు కార్యాలయాల్లో నేరుగా సంప్రదించాలని ఎండీ సుదర్శన్‌రెడ్డి సూచించారు.



కూకట్‌పల్లిలోని ఏవీబీపురం వద్ద మ్యాన్‌హోల్‌కు ఏర్పాటు చేసిన సేఫ్టీ గ్రిల్

నగరంలో ప్రధానంగా వర్షం వస్తే మ్యాన్‌హోళ్లలో పడి మృతి చెందిన ఘటనలున్న నేపథ్యంలో వాటర్‌బోర్డు అప్రమత్తమైంది. మ్యాన్‌హోళ్లను తెరవకుండా నగరవాసుల్లో అవగాహన కల్పించడంతో పాటు హెచ్చరికలు జారీ చేసింది. అంతేగాకుండా ప్రమాదాలు జరగకుండా ప్రత్యేక చర్యలు వాటర్‌బోర్డు తీసుకుంది. 25వేలకు పైగా మ్యాన్‌హోళ్లకు సేఫ్టీగ్రిల్స్ బిగించారు. ప్రధాన రహదారుల్లో ఉన్న వాటిని కవర్స్‌తో సీల్ చేసి, రెడ్ పెయింట్ ఏర్పాటు చేశారు. మ్యాన్‌హోళ్లను ఎప్పటికప్పుడు పర్యవేక్షించడానికి ప్రతి సెక్షన్ నుంచి సీవర్ ఇన్‌స్పెక్టర్ నేతృత్వంలో ఒక సీవరేజీ బృందాన్ని ఏర్పాటు చేశారు. వీరు ఉదయాన్నే క్షేత్రస్థాయిలో వారి పరిధిలోని ప్రాంతాలకు వెళ్లి పరిస్థితి పర్యవేక్షిస్తారు.

● ప్రజల్లో విస్తృత అవగాహనకు చర్యలు

వర్షాకాలంలో సీవరేజీ నిర్వహణలో సాధారణ పౌరులు ఎలా ప్రవర్తించాలి, ఎలా నడుచుకోవాలనే అంశాలపై వాటర్‌బోర్డు విరివిగా ప్రచారం చేస్తోంది. స్థానిక కాలనీల సంఘాలు, ఎస్‌హెచ్ గ్రూపుల సభ్యులతో ప్రజలకు అవగాహన కల్పిస్తోంది. అంతే కాకుండా చేయాల్సిన, చేయకూడని పనులపై పత్రికలు, టెలివిజన్, ట్విటర్, ఫేస్‌బుక్ వంటి ఇతర సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా ప్రచారం చేయడానికి సమాయత్తమవుతోంది.

● జీహెచ్‌ఎంసీ అధికారులు, పోలీసులు సమన్వయంతో పనులు

జీహెచ్‌ఎంసీ, పోలీసు శాఖల అధికారుల సమన్వయంతో పనులను చేయనున్నారు. వాటర్‌బోర్డు ఆధ్వర్యంలో ఎమర్జెన్సీ రెస్పాన్స్ టీమ్ (ఈఆర్టీ), సేఫ్టీ ప్రోటోకాల్ టీమ్ (ఎస్‌పీటీ) వాహనాలను రంగంలోకి దింపారు. క్షేత్రస్థాయిలో పనిచేసే సిబ్బందికి రక్షణ పరికరాలను అందించారు. ఈ బృందాలకు కేటాయించిన వాహనాల్లో జనరేటర్‌తో కూడిన డీ వాటర్ మోటార్ ఉంటుంది. దీని సాయంతో వర్షపు నీటిని తొలగిస్తారు. చోకేజీ, వాటర్ లాగింగ్ పాయింట్లను జీహెచ్‌ఎంసీ అధికారుల సమన్వయంతో ఎప్పటి కప్పుడు క్లియర్ చేస్తారు. వీటితోపాటు ఎయిర్‌టెక్ మిషన్లు సైతం అందుబాటులో ఉన్నాయి. మ్యాన్‌హోళ్ల నుంచి తీసిన వ్యర్థాలు (సిల్ట్)ని ఎప్పటికప్పుడు తొలగిస్తారు.

కుత్బుల్లాపూర్ తహసీల్దార్ కనిపించడం లేదని ఫిర్యాదు

జీడిమెట్ల, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): కుత్బుల్లాపూర్ తహసీల్దార్ అబ్దుల్ రహమాన్‌ఖాన్ కనిపించడం లేదని స్థానికులు జగద్గిరిగుట్ట పోలీసులకు మంగళవారం ఫిర్యాదు చేశారు. ఎనిమిది నెలల క్రితం కుత్బుల్లాపూర్ తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన ఆయన కార్యాలయానికి రావడం లేదని పేర్కొన్నారు. అసలే విద్యాసంవత్సరం ప్రారంభం కావడంతో సర్టిఫికెట్ల కోసం విద్యార్థులు తహసీల్దార్ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సి వస్తోందని పేర్కొన్నారు. కార్యాలయానికి ఎప్పుడు వెళ్లినా తహసీల్దార్ అందుబాటులో ఉండటం లేదని, ఎలక్షన్ డ్యూటీ అని సిబ్బంది సమాధానం చెబుతున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. అధికారులు నిర్లక్ష్యంగా ఉండటంతో ప్రభుత్వ భూములు మాయమవుతున్నాయని పేర్కొన్నారు. ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, తహసీల్దార్ కార్యాలయానికి వచ్చి అందరికి అందుబాటులో ఉండేలా చూడాలని కోరారు. ఫిర్యాదు చేసిన వారిలో మధు, మహ్మద్, రషీద్, సాయి తదితరులు పాల్గొన్నారు.



జగద్గిరిగుట్ట పోలీసులకు ఫిర్యాదు చేసిన యువకులు

ఇద్దరు డ్రగ్స్ పెడ్లర్ల అరెస్ట్

రూ. 2.50 లక్షల ఎండీఎంఏ స్వాధీనం

హైదరాబాద్‌సిటీ, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): వాహన తనిఖీలు నిర్వహించిన మేడ్చల్ ఎక్సైజ్ పోలీసులు ఇద్దరు వ్యక్తుల నుంచి రూ.2.50 లక్షల విలువైన ఎండీఎంఏను స్వాధీనం చేసుకున్నారు. మేడ్చల్ గండిమైసమ్మ ప్రాంతంలో డ్రగ్స్ విక్రయిస్తున్నాడన్న సమాచారంతో మేడ్చల్ ఎక్సైజ్ పోలీసులు గండిమైసమ్మ క్రాస్‌రోడ్స్‌లో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా బైకుపై వెళుతున్న మణికొండకు చెందిన పల్లపు క్రాంతి (23), బెంగళూరుకు చెందిన మహ్మద్ షోయబ్ (19) అనే యువకులను ఆపి తనిఖీలు నిర్వహించారు. బైకులోని టూల్ కిట్‌లో ఉంచిన 21 గ్రాముల ఎండీఎంఏ డ్రగ్స్‌ను గుర్తించి, ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. బెంగళూరుకు చెందిన కిరణ్ అనే వ్యక్తి నుంచి ఎండీఎంఏ కొనుగోలు చేశామని విచారణలో తెలిపారు, నగరంలో విక్రయించేందుకు ప్రయత్నిస్తుండగా ఎక్సైజ్ పోలీసులు అరెస్ట్ చేశారు.



నిందితులతో పాటు డ్రగ్స్ స్వాధీనం చేసుకున్న ఎక్సైజ్ పోలీసులు

ప్రభుత్వ స్థలంలో బహుళ అంతస్తు భవనం

● ప్రేక్షక పాత్రలో టౌన్ ప్లానింగ్ అధికారులు

ఫతేనగర్, జూన్ 11(ఆంధ్రజ్యోతి): బాలానగర్ టీ జంక్షన్ పక్కనే ఉన్న ప్రభుత్వ స్థలంలో కొందరు బహుళ అంతస్తు భవనాన్ని నిర్మిస్తున్నారు. ప్రభుత్వ స్థలంలో దర్జాగా అక్రమ నిర్మాణం జరుగుతున్నా మూసాపేట్ టౌన్‌ప్లానింగ్ అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఆరేళ్ల క్రితం బాలానగర్ ఫ్లైఓవర్ కోసం అధికారులు రోడ్డు విస్తరణ పనులు చేపట్టారు. ఈ క్రమంలో బాలానగర్ టీ జంక్షన్ వద్ద ఫుట్‌పాత్ ప్రభుత్వ స్థలం ఉంది. ఈ స్థలంపై కన్నేసిన కొందరు కబ్జారాయుళ్లు ప్రైవేటు వ్యక్తుల ద్వారా మీల్స్ సెంటర్‌ను పెట్టించి దశల వారీగా ఆ స్థలంలో బహుళ అంతస్తు భవనం నిర్మిస్తున్నాడు. ఈ నిర్మాణంపై స్థానికులు మూసాపేట్ అసిస్టెంట్ సిటీప్లానర్ మల్లేశ్వర్‌రావుకు ఫిర్యాదు చేసినా స్పందించడం లేదని వారు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా టౌన్‌ప్లానింగ్ అధికారులు స్పందించిన అక్రమ నిర్మాణంపై చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



బాలానగర్ టీ జంక్షన్ పక్కన ప్రభుత్వ స్థలంలో నిర్మిస్తున్న భవనం

రూ.10 కోట్లు కొల్లగొట్టారు

- యూట్యూబ్ చానళ్లలో ప్రచారం నిర్వహించిన కేటుగాడు
- శిక్షణ కోసం లక్ష ఫీజు వసూలు
- సహకరించిన భార్య, కొడుకు, అడ్వొకేట్
- నలుగురి అరెస్టు



సీసీఎస్ పోలీసులు అరెస్టు చేసిన నిందితులు

హైదరాబాద్ సిటీ, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): మోసపోయే వారు ఉన్నంత కాలం మోసం చేసే వారు ఉంటారనడంలో అతిశయోక్తి లేదు.. ఏపీకి చెందిన శివయ్య సులభంగా డబ్బు సంపాదించాలనుకున్నాడు. ఇందుకోసం భార్య కొడుకు, ఓ అడ్వొకేట్‌తో కలిసి ముఠాగా ఏర్పడ్డారు. రెండు యూ ట్యూబ్ ఛానళ్లు ఏర్పాటుచేశారు. ఓ ఛానల్ ద్వారా ప్రకృతి వైద్యుడిగా శివయ్య ప్రచారం చేసుకొన్నాడు. మరో ఛానల్ ద్వారా రియల్ ఎస్టేట్‌లో డబ్బు సంపాదించేందుకు శిక్షణ ఇస్తామని చెప్పారు. శిక్షణ తీసుకునే వారి నుంచి రూ.లక్ష ఫీజు వసూలు చేశారు. మొత్తం రూ.10 కోట్లకు పైగా వసూలు చేసి బిచాణా ఎత్తేశారు. బాధితుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన సీసీఎస్ పోలీసులు విచారణ చేపట్టి మంగళవారం నలుగురిని అరెస్టు చేశారు. నగరంలో ఉంటున్న ఏపీకి చెందిన శివయ్య అలియాస్ శివకుమార్ భార్య స్వర్ణలత, కొడుకు జశ్వంత్, అడ్వకేట్‌తో కలిసి సులభంగా డబ్బు సంపాదించేందుకు పథకం వేశాడు. మీ మాంస, రీబూట్ పేరుతో రెండు యూ ట్యూబ్ ఛానళ్లు ప్రారంభించారు. ప్రకృతి వైద్యంపై అవగాహన ఉండటంతో మీమాంస ఛానల్ ద్వారా శివయ్య బీపీ, మధుమేహం, థైరాయిడ్, కేన్సర్ వ్యాధులకు సలహాలు, సూచనలు ఇచ్చేవాడు. నమ్మిన వారిని మభ్యపెట్టి రీబూట్ అనే మరో ఛానల్ ద్వారా రియల్ ఎస్టేట్ రంగంలో డబ్బు సంపాదనకంటూ శిక్షణ ఇచ్చేవాడు. ఇందుకు గాను లక్ష ఫీజు వసూలు చేసేవాడు. రియల్ రంగంలో పెట్టుబడి పెడితే తక్కువ కాలంలో లాభాలొస్తాయని నమ్మించాడు. నిజమని నమ్మిన 70 మంది లక్షల్లో పెట్టుబడి పెట్టారు. వారి నుంచి శివయ్య రూ. 10.86 కోట్లు కొల్లగొట్టాడు. ఎంతకూ లాభాలు రాకపోవడంతో డబ్బులు ఇచ్చిన వారు నిలదీయగా తాను గత ప్రభుత్వంలో కొంతమంది పెద్దలకు బినామీ అని, నన్ను ఎవరూ ఏమీ చేయలేరని బెదిరించాడు. శివయ్య తీరుపై అనుమానం వచ్చిన బాధితులు పోలీసులను ఆశ్రయించగా అరెస్టు చేశారు. అతడ్ని విచారించగా.. భార్య స్వర్ణలత, కొడుకు జశ్వంత్, అడ్వొకేట్ శ్రీనివాస్‌తో కలిసి మోసం చేస్తున్నట్టు చెప్పాడు. వారిని కూడా పోలీసులు అరెస్టు చేశారు. ఈ కేసులో ప్రధాన నిందితుడైన శివకుమార్, అతని కొడుకు జశ్వంత్ గతంలో జైలు కెళ్లి బెయిల్‌పై బయటకు వచ్చారు. మళ్లీ మోసాలకు పాల్పడుతున్నారు. మీమాంస, రీబూట్ పేరుతో జరిగే మోసాలను నమ్మొద్దని, ఆర్థిక మోసాల విషయంలో అప్రమత్తంగా ఉండాలని సీసీఎస్ డీసీపీ సూచించారు.

'గాంధీ'కి రూ.50 లక్షల వైద్య పరికరాలు సాయం

అడ్డగుట్ట, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): గాంధీ మెడికల్ కాలేజీ పూర్వ విద్యార్థి ప్రవాంధ్ర వైద్యుడు గాంధీ ఆస్పత్రికి రూ.50 లక్షల విలువ చేసే వైద్య పరికరాలను అందజేశారు. గాంధీ మెడికల్ కాలేజీ పూర్వవిద్యార్థి డాక్టర్ దినేష్‌రెడ్డి మంగళవారం గాంధీ ఆస్పత్రి గ్యాస్ట్రో విభాగాధిపతి ప్రొఫెసర్ శ్రవణ్‌కుమార్ ఆధ్వర్యంలో గాంధీ ఆస్పత్రికి రూ.50 లక్షల విలువ చేసే వైద్య పరికరాలను వితరణ ఇచ్చారు. 20 ఏళ్లుగా వైద్య వృత్తిలో ఉంటూ సామాజిక సేవలో పాల్గొంటున్నాని దినేష్‌రెడ్డి తెలిపరు. తెలంగాణ డెబలప్‌మెంట్ ఫోరం అధ్యక్షుడిగా ఎడ్యుకేషన్, అగ్రికల్చర్, హెల్త్‌కేర్, స్కిల్ డెబలప్‌మెంట్‌పై పరిశోధించిన డాక్టర్ దినేష్‌రెడ్డి నివేదికను గత ప్రభుత్వానికి అందజేసినట్లు గుర్తు చేశారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ శ్రవణ్ కుమార్ డాక్టర్ దినేష్‌రెడ్డికి ప్రత్యేక అభినందనలు తెలిపారు.



గాంధీ ఆస్పత్రిలో పూర్వ వైద్య విద్యార్థితో సమావేశమైన గాంధీ వైద్యులు

గ్రూప్స్‌లో ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

హైదరాబాద్‌సిటీ, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): టీజీపీఎస్‌సీ ఆధ్వర్యంలో త్వరలో జరుగనున్న గ్రూప్-2, 3లో ఉచిత శిక్షణ కోసం ఆసక్తి కలిగిన మైనార్టీ అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు మైనార్టీ సంక్షేమశాఖ జిల్లా అధికారి మహ్మద్ ఇలియాస్ అహ్మద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా పరీక్షలకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు 45 రోజుల పాటు ఉచిత కోచింగ్ ఇస్తామన్నారు. అభ్యర్థులు హైదరాబాద్ జిల్లాకు చెందిన వారై ఉండాలని, దరఖాస్తులను ఈనెల 18లోగా ఆబిడ్స్‌లోని తెలంగాణ మైనార్టీస్ స్టడీ సర్కిల్, నాంపల్లి హౌస్‌లోని జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి కార్యాలయంలో సమర్పించాలన్నారు. తరగతులు జూన్ 19వ తేదీ నుంచి ప్రారంభమవుతాయన్నారు. మరిన్ని వివరాలకు ఫోన్ నంబర్ 040-23240134లో సంప్రదించాలని ఆయన సూచించారు.

15న వైకల్యం ఉన్నవారికి ఉచిత వైద్య శిబిరం

హైదరాబాద్‌సిటీ: హైదరాబాద్ పోలీస్, ఆకార్ ఆశా ఆస్పత్రి సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 15న శారీరక వైకల్యం ఉన్నవారికి ఉచితంగా వైద్య పరీక్షలు, శస్త్ర చికిత్స శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు ఆస్పత్రి నిర్వాహకులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఉచిత వైద్యశిబిరాన్ని సీపీ కొత్తకోట శ్రీనివాసరెడ్డి ప్రారంభిస్తారని, పబ్లిక్ గార్డెన్ ఎదురుగా ఉన్న హాకా భవన్‌లోని భరోసా సెంటర్‌లో ఉదయం 9 నుంచి 2 గంటల వరకు పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు.

అధిక డొనేషన్‌లు వసూలు చేస్తున్న కాలేజీలపై చర్యలు తీసుకోవాలి

హైదరాబాద్ సిటీ: రాష్ట్రంలో పేరుగాంచిన అటానమస్ ఇంజనీరింగ్ (ఏఈ) కళాశాలలు విద్యార్థుల నుంచి అధిక డొనేషన్లను వసూలు చేస్తున్నాయని, వాటిపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఇండియన్ స్టూడెంట్స్ యూనియన్ జాతీయ అధ్యక్షుడు పాపని నాగరాజు డిమాండ్ చేశారు. ఆయా కళాశాలలు ఇంజనీరింగ్, ఫార్మసీ విద్యార్థుల నుంచి డొనేషన్ ఇతర ఫీజుల పేరుతో డబ్బులు వసూలు చేస్తున్నాయన్నారు. ప్రముఖ కళాశాలలతో పాటు సెకెండ్, థర్డ్ గ్రేడ్ ఉన్న కాలేజీలు కూడా కొత్త రూల్స్ పేరుతో లక్షలు వసూలు చేస్తున్నాయని ఆరోపించారు. అటానమస్ పేరుతో ఆయా కాలేజీలు ఎలాంటి నోటిఫికేషన్ ఇవ్వకుండా సీట్లను భర్తీ చేసుకుంటున్నాయని గుర్తుచేశారు. దీనిపై విద్యాశాఖ అధికారులు, సీఎం స్పందించి అటానమస్ ఇంజనీరింగ్ కళాశాలలపై చర్యలు తీసుకోవాలని కోరారు.

ఎర్రకుంట చెరువుపై తప్పుడు రిపోర్టు సర్వేయర్లను సస్పెండ్ చేయాలి

నిజాంపేట్, జూన్ 11(ఆంధ్రజ్యోతి): నిజాంపేట్ కార్పొరేషన్ ప్రగతినగర్ ప్రాంతంలోని ఎర్రకుంట చెరువును ప్రైవేట్ భూమిగా రిపోర్టు ఇచ్చిన డీఐ, ఏడీ, సర్వేయర్‌ను సస్పెండ్ చేయాలని నిజాంపేట బీజేపీ అధ్యక్షుడు ఆకుల సతీష్ డిమాండ్ చేశారు. ఎర్రకుంట చెరువు కబ్జా విషయం, సర్వేయర్ల తప్పుడు రిపోర్టుపై జిల్లా అధికారులకు ఫిర్యాదు చేసిన అనంతరం చెరువు వద్ద విలేకర్ల సమావేశం నిర్వహించి మంగళవారం వివరాలు వెల్లడించారు. సర్వేనెంబరు 134 లో రికార్డుల ప్రకారం ప్రభుత్వ భూమి ఎర్రకుంట చెరువుగా ఉంది. కానీ రెవెన్యూ, ఇరిగేషన్, హె,చ్ఎండీఏ అధికారులు మాత్రం చెరువులో మ్యాప్స్, నిర్మాణాలకు తప్పుడు సర్వే నెంబరులతో తహసీల్దార్ ఎన్ఓసీ ఇచ్చినట్లు ఆరోపించారు. డీఐ సర్వేయర్ గంగాధర్, ఏడీ శ్రీనివాస్ ఆర్డినెన్స్‌ను మార్చారని ఆరోపించారు. ఒక్కో ఆర్డినెన్స్‌ను దాదాపు 9 మీటర్ల మేర జరిపి, ఓ కార్పొరేటర్‌కు, కొందరు బిల్డర్లకు లబ్ధి చేకూర్చారన్నారు. తప్పుడు సర్వే చేసిన అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఎర్రకుంట చెరువులోని ఆక్రమణలు తొలగించేందుకు బీజేపీ ఆధ్వర్యంలో అలుపెరగని పోరాటం చేస్తామని సతీష్ హెచ్చరించారు. ఈ విలేకరుల సమావేశంలో కార్పొరేషన్ సెక్రటరీ అరుణ్‌రావు, మీడియా సెల్ కో-కన్వీనర్ ఉదయ్, కిసాన్ మోర్చా అధ్యక్షుడు ప్రసాద్‌రావు, ఉపాధ్యక్షుడు మాధవరావు, ఓబీసీ మోర్చా ప్రధాన కార్యదర్శి ముఖేష్, సీనియర్ నాయకులు ఎల్లాస్వామి పాల్గొన్నారు.



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఆకుల సతీష్



విద్యాదాత పురస్కారాన్ని అందుకుంటున్న గోరుకంటి రవీందర్‌రావు

రవీందర్‌రావుకు విద్యాదాత పురస్కారం

హైదరాబాద్‌సిటీ, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): యశోద ఫౌండేషన్, యశోద ఆస్పత్రుల గ్రూప్ వ్యవస్థాపకుడు గోరుకంటి రవీందర్‌రావుకు విద్యాదాత పురస్కారాన్ని వందేమాతరం ఫౌండేషన్ అందించింది. రవీంద్రభారతిలో జరిగిన అవార్డుల ప్రదానోత్సవంలో ఆయన ఈ పురస్కారాన్ని స్వీకరించారు. అనాథ పిల్లలను విద్యార్థులుగా తీర్చిదిద్దడం, ఆర్థిక స్వావలంబనను సాధించుకోవడానికి సేవలు అందిస్తున్నందుకు ఆయనకు ఈ పురస్కారానికి ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖ కమిషనర్ దేవసేన, జయప్రకాశ్‌నారాయణ, బీవీఆర్ మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీఎంను కలిసిన డాక్టర్ రఘురాం

హైదరాబాద్ సిటీ, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డిని ఉషా లక్ష్మి బ్రెస్ట్ కేన్సర్ ఫౌండేషన్ సీఈఓ, డైరెక్టర్ డాక్టర్ రఘురాం మంగళవారం సచివాలయంలో కలిశారు. భారతదేశంలో మహిళలను ప్రభావితం చేసే అత్యంత సాధారణ కేన్సర్ రొమ్ము అని, దాని నియంత్రణ మార్గాలపై సీఎంతో చర్చించినట్లు ఆయన తెలిపారు. తెలంగాణలో పటిష్టమైన జనాభా ఆధారిత రొమ్ము కేన్సర్ స్క్రీనింగ్ కార్యక్రమాన్ని అమలు చేయాలనే ప్రతిపాదనను డాక్టర్ రఘు రామ్ సమర్పించారు. డాక్టర్ రఘు రామ్ చేస్తున్న ప్రయత్నాలను సీఎం ప్రశంసించారు. ప్రతిపాదనను పరిశీలిస్తామని సీఎం హామీ ఇచ్చారని రఘురాం తెలిపారు.



సీఎం రేవంత్ రెడ్డితో డా.రఘురాం